**2వ పాఠం** **ఏప్రిల్ 2-8**

# పతనము

**సబ్బాతు మధ్యాహ్నము** **ఏప్రిల్ 2**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఆది 3; 2కొరింథి 11:3; ప్రకటన 12:7-9; యోహాను 8:44; రోమా 16:20; హెబ్రి 2:14; 1తిమో 2:14,15.**

**కంఠతవచనం : "మరియు నీకును స్త్రీకిని నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తల మీద కొట్టును. నీవు దాని మడిమె మీద కొట్టుదువని చెప్పెను" (ఆది 3:15).**

దేవుడు ఏదెనులో మన ఆది తల్లిదండ్రులకు అనుగ్రహించిన వాటితోపాటు ఒక హెచ్చరిక కూడా ఇచ్చియున్నాడు.

"ఆయన స్త్రీతో నీ ప్రయాసమును నీ గర్భ వేదనను నేను మిక్కిలి హెచ్చించెదను. వేదనతో పిల్లలను కందువు. నీ భర్త యెడల నీకు వాంఛ కలుగును. అతడు నిన్ను ఏలునని చెప్పెను. ఆయన ఆదాముతో నీవు నీ భార్య మాట విని –తినవద్దని నేను నీకాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపింపబడియున్నది. ప్రయాసముతోనే నీవు బ్రదుకు దినములన్నియు దాని పంట తిందువు" (ఆది 3:16,17).

మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములు తినకూడదని ఇవ్వబడిన హెచ్చరికలో వారు మంచిని తెలుసుకొనవచ్చును గాని చెడును వారు తెలుసుకొనకూడదనే నియమము అందులో ఉన్నది.

మనము ఎందుకు తెలుసుకొనకూడదు అనే విషయములో అర్ధము చేసుకొనవచ్చును. దానితోపాటు వారు అవిధేయులైనచో నిశ్చయముగా వారికి మరణము సంప్రాప్తమగుననెడి హెచ్చరిక (ఆది 2:17) నెరవేరబోవుచున్నది. (ఆది 3:19) అంతటితోనే కాక, వారు పాపులు గానే నిత్యజీవములో ప్రవేశించకుండునట్లు (ఆది 3:22) ఏదెను వనమునుండి వెళ్ళగొట్టబడిరి (ఆది 2:24).

అయితే ఈ విషాద సంఘటన నడుమ నిరీక్షణతో కూడిన ఒక వాగ్దానము చేయబడెను (ఆది 3:15). దానినే మొదటి సువార్త వాగ్దానము లేక ప్రాధమిక రూపములో ఉన్న మాదిరి సువార్త మానము" అని పిలువబడుచున్నది. అవును పైన పేర్కొనబడిన ఈ వాక్యము బైబిలులో కనిపించే మొదటి సువార్త వాగ్దానమును సూచిస్తుంది. మానవులు పాపములో పడిపోయినను మనమందరము తప్పించుకొనే మార్గమును దేవుడు సిద్దము చేసెననే వార్త మనకు మొదటిసారి తెలియజేయబడెను.

– ఏప్రిల్ 9, సబ్బాతుదినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం ఏప్రిల్ 3

## సర్పము

**ఆది 3:1; 2కొరింథి 11:3 మరియు ప్రకటన 12:7-9 చదువుడి. సర్పము ఎవరు? హవ్వను అతడు ఏవిధముగా మోసము చేసెను?**

.............................................................................................................

ఈ వాక్యము సర్పముతో ఆరంభమైంది. ఆ వాక్యమును జాగ్రత్తగా పరిశీలించినచో అందులో ప్రముఖముగా సర్పమును గూర్చియే చెప్పబడినది. ఒక స్పష్టమైన విషయముగా సత్యమును గురించి వివరించుట వలన అది బాగుగా తెలిసిన ఆకారమును సూచిస్తుంది. చదువరులు ఇప్పటికీ అది ఎవరైయుంటారో అనే నిర్ధారణకు వచ్చియుంటారు.

పరిశుద్ధ లేఖనములు సర్పమును దేవుని యొక్క శత్రువుగా గుర్తించెను. (యెషయా 27:1) ప్రత్యేకముగా అతడిని "అపవాది" మరియు "సాతాను" అని పిలిచెను. (ప్రక 12:9). అదే విధముగా పురాతన సమీప తూర్పు దేశాలలో దుష్టశక్తికి మారు రూపముగా 'సర్పమును' చూచేవారు.

సాతానుడు ఎక్కువ శ్రమ పడకుండానే తన కార్యమును సఫలము చేసుకొనుటకు సర్పమును మధ్యవర్తిగ ఉపయోగించుకొని, తన మోసమును చక్కగా కప్పిపుచ్చుకున్నాడు. భూమి మీద ఉన్న సృజింపబడిన జంతువులలో బహు అందమైనది మరియు యుక్తిగలదై యున్నది. దానికి రెక్కలుండెను. మరియు అది గాలిలో ఎగిరేటప్పుడు బంగారు వర్ణము తేజోవంతమైన కాంతిని వెదజల్లినట్లు కనిపించెను. -ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుట 53.

అపవాది గురించి మాట్లాడేటప్పుడు అతడు ఏ రూపములో కనిపించినా బైబిలు అతని రూపమునకు ప్రాధాన్యతనివ్వకుండా, అక్షరాలా అతడు "సాతాను" అని మానవునికున్న చీకటి కోణమునకు అతడు గురైయున్నాడని లేఖనములు సెలవిచ్చుచున్నవి.

సర్పము తనను తాను దేవునికి శత్రువుగా చూపించుకొనలేదు. దానికి విరుద్ధముగా సర్పము దేవుని మాటలనే ఎంచుకొని, ఆయనను బలపర్చుచున్నట్లు ప్రయత్నము చేసెను. మొదటి నుండి కూడా అటువంటి ప్రవర్తననే సాతాను కూడా చూపించుట జరిగింది. సాతాను దేవుని మాటలను తన నోటి ద్వారా వినిపించి అవసరమైతే దేవుని వాక్యమునే ఉదాహరించి మోసము చేయగలడు. (మత్తయి 4:6).

ఇంకా గమనించినట్లయితే హవ్వతో సర్పము వెంటనే వాగ్వాదమునకు దిగకుండ ఆ స్త్రీకి ఒక ప్రశ్న వేసి వారికి దేవుడు చెప్పిన విషయాన్ని అతడు కూడా నమ్ముచున్నట్లు నటించాడు. దేవుడు చెప్పెనా? అని అతడు ఆమెనడిగెను (ఆది 3:1). ఆవిధముగా ఆరంభమునుండి కూడా అతడెంత కపటముగాను, మోసపూరితముగాను ఉన్నాడో గమనించండి. మనము చూస్తే అతని విధానం పనిచేసినట్లే కనిపించుచున్నది.

**ఏదెనులో పాపరహితమైన హవ్వను సాతానుడు మోసం చేయగలిగితే మనమింకెంత ఎక్కువ దాడికి అనువైనవారంగా ఉంటాము. అతని మోసాలను ఎట్లు వివరించగలం?**

**సోమవారం** **ఏప్రిల్ 4**

## నిషేధింపబడిన ఫలము

**ఆది 2:16, 17; ఆది 3:1-6 చదువుడి (యోహాను 8:44). దేవుడు ఆదాముకిచ్చిన ఆజ్ఞలోని మాటతో సర్పము స్త్రీతో మాట్లాడిన మాటలను పోల్చి చూడుడి. ఆ రెండు సంభాషణలలో ఉన్న తేడా ఏమిటి? ఆ తేడాల భావమేమిటి?**

..........................................................................................

దేవుడు ఆదాముతో పలికిన మాటలను (ఆది 2:16,17) హవ్వ సర్పముతో మాట్లాడిన మాటలలో ఉన్న సాదృశ్యములను గమనించండి. ఈ స్థితిలో సర్పము దేవునిని ప్రక్కనబెట్టి ఆయనకన్నా అతనికే ఎక్కువ తెలుసు అన్నట్లు మాట్లాడుచుండెను. ఒకవేళ ఆ స్త్రీ దేవునిని అపార్థము చేసుకొని యున్నదేమో అని తెలుసుకొనుటకు ముందుగా ఆమెను ఒక ప్రశ్న వేశాడు. తరువాత బాహాటముగానే దేవుని యొక్క ఉద్దేశాలను ప్రశ్నించి, అటు తరువాత వాటికి విరుద్ధముగా తన అభిప్రాయములను వెల్లడించెను.

సాతానుడు చేసిన ఎదురు దాడిలో రెండు విషయాలున్నవి. మరణము మరియు మంచి చెడ్డల తెలివిని గూర్చి ప్రశ్నించాడు. వారి మరణము తథ్యమని దేవుడు చాలా స్పష్టముగాను ఒత్తి పలికినను (ఆది 2:17) సాతానుడు దేవుని మాటలకు విరుద్ధముగా మీరు చావనే చావరు అని చెబుతూ మానవులు నిత్యత్వము కలిగినవారనే భావమును వ్యక్తపర్చాడు (ఆది 3:4). ఆదాము ఆ ఫలమును తినకూడదని నిషేధిస్తే (ఆది 2:17) సాతానుడు మాత్రము ఆ ఫలమును తింటే వారు దేవునివలె ఉందురని వారిని ప్రోత్సహించెను (ఆది 3:3).

ఇక్కడ సాతానుడు రెండు వాదనలను వినిపిస్తున్నాడు. నిత్యత్వము మరియు దేవుని వలె ఉండుట. ఈ రెండు విషయాలను బట్టి హవ్వ ఆ ఫలమును తినుటకు సమ్మతించెను. ఆ స్త్రీ దేవునికి అవిధేయత చూపించి ఆయన నిషేధించిన ఫలమును తినాలని తన మనసులో సమ్మతించిన వెంటనే దేవుడు ఆమె చెంతలేనట్లు ఆ స్థానములో ఆమెనే ఆమె చూచుకొనే విధముగా ప్రవర్తించడం ఆరంభమైంది. తరువాత వ్యక్తిత్వ మార్పు సంభవించినట్లు బైబిలు వాక్యము సూచించుచున్నది. హవ్వ దేవుని భాషను ఉపయోగిస్తున్నది. నిషేధింపబడిన ఫలమునకు హవ్వ విలువకట్టింది. అది మంచిదిగ ఆమె చూచినది (ఆది 3:6) దేవుడు కూడా ఆయన చేసిన సృష్టిని చూచినపుడు మంచిదిగా ఉన్నదని కనుగొనెను (ఆది 1:4) ఆవిధముగా దేవుడు విలువ కట్టినట్లు ఆమె కూడా విలువ కట్టినట్లు గుర్తు చేస్తున్నది.

ఈ రెండు శోధనలు, ఒకటి నిత్యత్వము కలిగియుండుట మరియు దేవుని వలె ఉండుట అనునవి పురాతన ఐగుప్తు మరియు గ్రీకు మతముల యొక్క నమ్మకములకు పునాదులైయున్నవి. నిత్యత్వము కలిగియుండాలని కోరిక దైవానుగ్రహమైనదని వారు భావిస్తారు. నిత్యత్వము దైవ సంబంధమైన గుణము కాబట్టి దానిని వారు కోరుకుంటారు. ఇటువంటి

ఆలోచన యూదయ క్రైస్తవ సంప్రదాయములలో చొరబడింది. ఆ విధమైన ఆలోచనలనుండే ఆత్మ నిత్యత్వము అనే నమ్మకము ఉద్భవించినది. పురాతన దినములలో కాకుండా నేడు కూడా అనేక సంఘాలలో ఆత్మ నిత్యత్వము అనే నమ్మకము చాలా బలముగా ఉన్నది.

**జన్మతః మనలో నిత్యత్వమనేది ఒకటుందనే నమ్మకములను గూర్చి ఆలోచించండి. ఇటువంటి ప్రమాదకరమైన మోసము నుండి కాపాడబడుటకు మనము మానవ స్వభావమును గూర్చి మరణించిన వారి స్థితిని గూర్చి అర్థము చేసుకున్నచో అవి ఎట్లు సహాయపడును?**

మంగళవారం ఏప్రిల్ 5

## దేవుని యెదుటికి రాకుండా దాగుకొనుట

**ఆది 3:7-13 చదువుడి. దేవుని యెదుటికి రాకుండా ఆదామవ్వలు దాగుకొనవలసిన అవసరము ఎందువలన కలిగినది? మీరెక్కడున్నారనే ప్రశ్నను దేవుడు ఎందువలన అడిగెను? వారి ప్రవర్తనను ఆదామవ్వలు సమర్థించుకొనుటకు ఏవిధముగా ప్రయత్నించారు?**

..............................................................................................

ఆదామవ్వలు పాపము చేసిన తరువాత వారి యొద్ద నుండి దేవుని యొక్క సన్నిధి అనే మహిమ వస్త్రములు తొలగిపోవుట వలన వారు దిగంబరులుగా ఉన్నట్లు తెలుసుకున్నారు. (కీర్తన 8:5 చూడుడి. ఈ వాక్యమును కీర్తన 104:1,2తో పోల్చి చూడుడి). పాపము వలన వారు కలిగియున్న దేవుని యొక్క స్వరూపము దెబ్బతినినది. క్రియా పదమైన "చేయడము" అనే క్రియాపదము దేవుడు చేసిన పనులకు మాత్రమే వర్తించేది. అయితే ఇప్పుడు వారు దేవుని ప్రక్కన పెట్టి ఆదామవ్వలే వారికి కచ్చడములను చేసుకొనుట ద్వారా, వారి పాపమును కప్పిపుచ్చుట కొరకు సృష్టికర్తనే ఆయన స్థానములో నుండి వారు తొలగించెను. ఈవిధముగా ఆదామవ్వలు కచ్చడములను తయారు చేసుకొనుట అంటే క్రియల మూలమున నీతిమంతులుగా తీర్చబడుటకు చేసే ప్రయత్నమైయున్నదని పౌలు అటువంటి చర్యలను తప్పుబట్టెను (గలతీ 2:16).

దేవుడు వారిని సమీపించినపుడు 'మీరెక్కడున్నారు? అనే ప్రశ్నను వేసాడు (ఆది 3:9). అటువంటి ప్రశ్ననే దేవుడు కయీనును అడిగాడు (ఆది 4:9) దేవుడు వారిని అడిగిన ప్రశ్నలకు ఆయనకు జవాబు తెలుసు. అపరాధ భావముతో నలిగిపోవుచున్న వారికి సహాయపడి, వారు ఏమి చేసారో గ్రహించగలిగేటట్లు చేసి అదే సమయములో మారు మనస్సు పొంది రక్షింపబడుటకు వీలుగా ఉండుటకు ఆయన ప్రశ్నలు ఉంటాయి. మానవులు పాపము చేసిన క్షణము నుండి ప్రభువైన దేవుడు వారి రక్షణ మరియు విమోచన కొరకు పని చేయుచునే వున్నాడు.

ఆ దృశ్యాన్ని అవగాహన చేసుకున్నట్లయితే "పరిశీలన తీర్పు" భావము అందులో ప్రతిబింబించుచున్నది. అందులో న్యాయమూర్తి దోషిని ప్రశ్నించి (ఆది 3:9). శిక్షను ఎదుర్కొనుటకు అతడిని సిద్ధము చేస్తాడు (ఆది 3:14-19). అయితే న్యాయమూర్తి తాను

దోషిని ప్రశ్నించే సమయములోనే అతనిలో మారు మనసు వచ్చే విధముగా పురికొల్పి చివరకు రక్షణకు నడిపిస్తాడు (ఆది 3:15). ఇక్కడ ఒకని బుద్ధిని వినియోగించి అతనిలో మార్పు తీసుకొనివచ్చుటకు తగిన ఉద్దేశము కనిపిస్తున్నది. ఇదే విధానము బైబిలంతటిలోను కనిపిస్తుంది.

మొదటగా పాపులందరిలోను కనిపించే విధముగా ఆదామవ్వలు ఇరువురు కూడా వారి మీద మోపబడిన నేరమును అంగీకరించుటకు ఒప్పుకొనక, ఇతరులను నిందించే పనిలో పడ్డారు. దేవుడు ఆదామును అడిగిన ప్రశ్నకు దేవుడతనికి ఇచ్చిన హవ్వ కారణమని జవాబిచ్చెను (ఆది 3:12) ఆజ్ఞను మీరుటకు ఆమె అతడిని నడిపించినదని చెప్పెను. అది ఆమె చేసిన తప్పే (అటువంటి స్త్రీని ఇచ్చినందుకు దేవునిది కూడా తప్పే అన్నట్లు) తనది కాదని అన్నాడు.

హవ్వ సమాధానమిస్తూ సర్పము ఆమెను మోసము చేసినదని చెప్పెను. హీబ్రూ క్రియాపదమైన “నషా” మోసము (ఆది 3:13) అనగా మనుష్యులలో అబద్ధపు ఆశలను రేకెత్తించి వారు చేయుచున్నది. న్యాయమైనదే అని నమ్మించడమును మోసము అని అంటారు (2రాజు 19:10; యెష 37:10; యిర్మియా 49:16).

ఆదామునకు హవ్వ ఆ పండు ఇచ్చినదని నిందించాడు. హవ్వ సర్పమును నిందిస్తూ అతడు ఆమెను మోసగించెను అని చెప్పెను (ఇద్దరు చెప్పే విషయములో కొంత సత్యము ఉండవచ్చు). అయితే చిట్ట చివరికి ఇద్దరూ తప్పు చేసినవారే.

**వారు చేసిన దాని నిమిత్తమై ఇతరులను నిందించుటకు ప్రయత్నించడమా? అదే ఉచ్చులో మనము కూడా పడుటకు ఎందుకంత సులభము?**

బుధవారం **ఏప్రిల్ 6**

## సర్పము యొక్క అంతం

“మరియు నీకును స్త్రీకిని నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తల మీద కొట్టును. నీవు దానిని మడిమె మీద కొట్టుదువని చెప్పెను” (ఆది 3:15).

**ఇక్కడ ప్రభువైన దేవుడు సర్పముతో ఏమి చెప్పెను? మరియు ఈ వాక్యాలలో ఇమిడియున్న నిరీక్షణ ఏమిటి?**

ఈ అభినయమంతటిని ఆరంభించినవాడు సర్పమే గనుక దేవుని యొక్క తీర్పు అతనితోనే ప్రారంభమైంది. ఈ వృత్తాంతమంతటిలో సర్పము మాత్రమే శపించబడ్డాడు.

మనమిక్కడ ఒక విధమైన “వ్యతిరేక దిశలో” వెళ్ళిన సృష్టి యొద్దకు చేరుకుంటున్నాము. సృష్టి జీవమునకు నడిపించింది. మంచిని ప్రశంసించుట కొరకు మరియు దీవెనలు పొందుటకు సహాయపడింది. అయితే తీర్పు మరణమునకు, పాపమునకు మరియు శాపములకు నడిపించుటయే గాక అది నిరీక్షణకు మరియు రక్షణ వాగ్దానమునకు కూడా

నడిపించుచున్నది. ఇక్కడ శపించబడిన, నలుగగొట్టబడిన సర్పము మన్ను తినే దృశ్యముతో పాటు (ఆది3:14). మానవ జాతికి స్పష్టముగా కనిపించే రక్షణకు సంబంధించిన నిరీక్షణ ఒక ప్రవచన రూపములో కనబడుచున్నది. శిక్ష విధించకముందే ఆదామవ్వలకు దేవుడు మోక్షమునకు సంబంధించిన ఒక నిరీక్షణను వాగ్దానము చేసాడు (ఆది 3:15). అవును వారు పాపము చేసారు. చేసిన పాపమునకు శ్రమను అనుభవిస్తారు. మరణిస్తారు కూడా. అయితే ఇన్ని వ్యతిరేకతలున్నను ఒక నిరీక్షణ రక్షణ నిరీక్షణ ఉన్నది.

**ఆది 3:15ను రోమా 16:20; హెబ్రీ 2:14 మరియు ప్రకటన 12:17తో పోల్చి చదువుడి. ఈ వాక్యాలలో రక్షణ ప్రణాళిక మరియు మహా గొప్ప పోరాటము ఏవిధముగా బయలుపర్చబడినవి.**

ఆది 3:15 మరియు ప్రకటన 12:17లో సమానముగా ఉన్న విషయాలను చూడుడి. ఘట సర్పము, ఆగ్రహము (శత్రుత్వము) సంతానము మరియు ఏదెనులో స్త్రీ మరియు ప్రకటన 12:17లో స్త్రీ యుద్ధము (మహా గొప్ప పోరాటము) ఏదెను వనమునకు మార్చబడినది. దాని ఫలితముగా మానవుడు పతనమాయెను. ఆ పోరాటము అంత్యకాలము వరకు కొనసాగనైయున్నది. అయితే సాతాను యొక్క ఓటమికి సంబంధించిన వాగ్దానము ఏదెనులోనే ఇవ్వబడింది. ఆ ఓటమిలో అతని తల నలుగగొట్టబడును. దాని భావమును చాలా వివరముగా ప్రకటనలో అతని అంతిమ మరణము గూర్చివివరించబడినది. (ప్రకటన 20:10) దీనిని బట్టి ఆరంభము నుండి మానవ జాతికి కష్టతరమైన పరిస్థితులలో కూడా చెడును గూర్చిన జ్ఞానము ద్వారా వారు తప్పించుకొనే మార్గము సూచించబడింది. ఇప్పుడు ఆ నిరీక్షణను మనమందరము పంచుకొనవచ్చును.

**భూమి మీద ఎక్కడైతే పాపము దుర్మార్గము ఆరంభమైందో అనగా ఏదెనులోనే ఆరంభమైన చోటనే దేవుడు ఎందుకు రక్షణ ప్రణాళికను ప్రకటించెను?**

గురువారం **ఏప్రిల్ 7**

## మనుష్యుని గతి

**ఆది 3:15-24 చదువుడి. పాపములో పడిపోవుట వలన ఆదామవ్వలకు ఏమి సంభవించినది?**

........................................................................................................

సర్పమునకు దేవుడిచ్చిన తీర్పు శాపముగా గుర్తింపబడినను (ఆది 3:14) అదే సమయములో పురుషుని మీదను. స్త్రీ మీదను ఇచ్చిన తీర్పు శాపముతో కూడినది కాదు. శాపము లేక నడిపించబడెను అనే మాట మరొకసారి భూమి లేక నేలను ఉద్దేశించి వాడబడినది. (ఆది 3:17) దీనిని బట్టి చూచినట్లయితే పురుషుని విషయమై, స్త్రీ విషయమై సర్పము వంటిది కాక వేరొక ప్రణాళిక ఉందని కనిపిస్తుంది. సర్పమునకు అనుగ్రహించని ఒక నిరీక్షణను స్త్రీలకు, పురుషులకును అనుగ్రహించబడెను.

స్త్రీ సర్పముతో సంబంధము ఏర్పరచుకొనుట వలన ఆమె పాపములో పడినది. స్త్రీ యెడల దేవుడిచ్చిన తీర్పు సర్పము మీదిచ్చిన తీర్పునకు సంబంధించినదిగా ఉన్నట్లుంది (ఆది 3:16 వచనము ఆది 3:15) తరువాత రావడమే కాకుండా, ఈ రెండింటికి సమముగా ఉన్న విషయాలు కనబడుచున్నవి. ఈరెండు వాక్యాలలో ఉన్న ప్రవచనాల మధ్య ఉన్న సమమైన విషయాలు చూచినపుడు స్త్రీ విషయమై ఆది 3:16, 3:15లో ఉన్న మెస్సియాకు సంబంధించిన ప్రవచనముతో కలిపి చదవాలి. స్త్రీని గురించి దేవుడిచ్చిన తీర్పులో పిల్లలనుకనే విషయములో రక్షణకు అనుకూలమైన దృష్టి కోణముతో అర్థము చేసుకొనవలసియుంది (1తిమోతి 2:14, 15తో పోల్చి చూడుడి).

దేవుని మాటలను వినుటకు బదులు పురుషుడు స్త్రీ మాట విని పాపములో పడ్డాడు కాబట్టి ఏ నేలనుండయితే పురుషుడు తీయబడినాడో ఆ నేల శపించబడినది. (ఆది 3:17). అందుచేత పురుషుడు కష్టముతో కూడిన (ప్రయాసతో) పనిచేయవలసియున్నాడు (ఆది 3:17-19). అతడు మన్ను నుండి తీయబడినాడు కనుక తిరిగి మన్నై పోవును (ఆది 3:19) అయితే ఆవిధముగా ఎన్నడు జరిగియుండవలసినది కాదు గాని, పాపములో పడిపోవుట వలన అది తప్పని సరియైనది. అది దేవుని యొక్క మొదటి ప్రణాళిక కాదు.

నిరాశతో కూడిన మరణము ఆదామునకు సంభవించినను, స్త్రీ పిల్లలను కనుట ద్వారా అతడు ఆమెలో జీవమునకు సంబంధించిన ఒక నిరీక్షణను చూడగలిగాడు (ఆది 3:20). ఆదామునకు మరణ శిక్ష పడినను జీవసంబంధమైన ఒక నిరీక్షణను చూడగలిగాడు.

ప్రేమించే తల్లిదండ్రుల వలె దేవుడు కూడా వారికి మేలు జరగాలి గాని కీడు జరగకూడదనే అభిప్రాయము కలిగినవాడు. ఇప్పుడైతే మానవులు చెడును తెలుసుకున్నారు కాబట్టి ఆ చెడు నుండి వారిని కాపాడుటకు దేవుడు చేయగలిగినదంతయు చేస్తాడు. ఇన్ని తీర్పుల మధ్య మన ఆది తల్లిదండ్రులు వారి నిరీక్షణను కోల్పోలేదు. దేవుని యెడల ఆదామవ్వలు అవిధేయత చూపినా దేవుని మాటలను, ప్రేమను వారెన్నడు అనుమానపడలేదు.

**జ్ఞానము దానంతట అది మంచిదే అని మనము ఆలోచించుకొనినను ఎందువలన అన్నిసార్లు ఆవిధంగా జరుగుట లేదు? కొన్ని విషయాలు తెలియకపోవుట వలన మంచే జరిగే విషయాలేమిటి?**

## శుక్రవారం ఏప్రిల్ 8

## అదనపు అధ్యయనము

జీవవృక్షమునకు మరియు మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షమునకు మధ్య ఉన్న సంబంధమును గూర్చి పరిశీలించుడి. ఈ రెంటికి మధ్య ఉన్న బాంధవ్యమును బట్టి చూస్తే ఈ రెండు వృక్షములు ఏదెను వనము యొక్క మధ్య భాగములో ఉన్నవి (ఆది 2:9). వీటి మధ్య భూగోళ శాస్త్ర సంబంధమైన బాంధవ్యమే కాక ఇంకా ఎక్కువే వున్నది. మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమునుండి దాని ఫలములను మానవులు తీసుకొని తినిరి. తద్వారా వారు దేవునికి అవిధేయులయ్యారు. దానికి పలితముగా జీవ వృక్షఫలములకు దూరమయ్యారు. ఆ

పరిస్థితిలో వారు చిరకాలము జీవించలేకపోయారు. దీని ద్వారా ఒక గొప్ప నీతి సూత్రమును తెలుసుకున్నారు. సొలోమోను తన కుమారునికి సలహాయిచ్చిన ప్రకారము నైతికపరమైన మరియు ఆధ్యాత్మికమైన నిర్ణయాలు మనుష్యుల జీవితాలపై వాటి ప్రభావమును చూపిస్తాయనే సత్యమును నేర్పించాయి.

"నా కుమారుడా నా ఉపదేశమును మరువకుము. నా ఆజ్ఞలను హృదయపూర్వకముగా గైకొనుము. అవి దీర్ఘాయువును, సుఖజీవనముతో గడచు సంవత్సరములను శాంతిని నీకు కలుగజేయును" (సామెతలు 3:1,2). ఈ సంబంధము మరొకసారి భవిష్యత్తు పరలోక యెరూషలేములో తిరిగి ఏర్పడును. అక్కడ ఆ పట్టణపు రాజవీధి మధ్యన (ప్రకటన 22:2) జీవవృక్షము మాత్రమే కనిపిస్తుంది.

దేవుడు హవ్వను సృష్టించినపుడు ఆమె పురుషునికన్నా తక్కువ దానిగా గాని లేక అతనికన్నా ఎక్కువ దానిగా గాని ఆయన నిర్మించలేదు గాని అన్నివిషయాలలో అతనికి సమాన వ్యక్తిగానే సృష్టించాడు. పవిత్రమైన జంటలో ఏ ఒక్కరు ఒకరికి తెలియకుండా మరొకరికి స్వతంత్ర అభిరుచులు గాని స్వార్థంతో కూడిన భావాలు గాని ఉండే అవకాశము లేకపోయినను, వారిరువురు సొంత వ్యక్తిత్వము కలిగిన వారుగా ఆలోచించేవారు. ప్రవర్తించేవారు, ఆజ్ఞను అతిక్రమించుటలో హవ్వ మొదట పాపము చేసినది కాబట్టి ఆదాము ఆమెను ఏలునని దేవుడు చెప్పెను. ఆమె తన భర్తకులోబడి యుండునని అది తనకు యివ్వబడిన శాపములో ఒక భాగమైయుందని దేవుడు చెప్పెను. అనేక సందర్భాలలో ఈ శాపమువలన స్త్రీ యొక్క జీవితము ఘోరమైనదిగాను భారమైనదిగాను మారినది. పురుషునికి దేవుడిచ్చిన ఆధిక్యమును అతడు అనేక సందర్భాలలో దుర్వినియోగము చేయుచు, నిరంకుశమైన రీతిలో అధికారమును చలాయిస్తూ తిట్టుట, దూషించుట చేయుచున్నాడు. అనంతమైన తన జ్ఞానము చొప్పున రక్షణ ప్రణాళికను రూపొందించి దాని ద్వారా మానవ జాతికి మరొక అవకాశమును అనుగ్రహించెను".-ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 3, పుట 484.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. దేవుడు ఏదెనులో ఆదామును కలుసుకొని అతడు చేసిన అతిక్రమమును నిరూపించుటకు మరియు అతనిలో మారుమనస్సు కలిగేవిధముగా కొన్ని ప్రశ్నలు వేసెను. ఇతరుల మీద నేరము మోపుట అనే తీరు కయీనులోను (ఆది 4:9,10). జలప్రళయములోను (ఆది 6:5-8) బాబెలు గోపురము విషయములోను (ఆది 11:5) మరియు సొదొమ గొమొఱ్ఱాల విషయములోను (ఆది 18:21) తిరిగి కనిపించినది. ఈ సంఘటనలన్నింటిలోను పరిశీలన తీర్పు అనే భావము ఏవిధముగా బయలుపర్చబడెను.
2. మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినుట ద్వారా అది ఆమెకు జ్ఞానమును కలుగజేయునని హవ్వ ఎందుకు ఆలోచించింది? అట్టి పొరపాటు చేయకుండా ఏవిధముగా తప్పించుకొనగలము?

❋✶❋